రుణమాఫీ చేస్తే.. పథకాలకు పైసలెట్లా?

- ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోనే రుణమాఫీకి రుణం తీసుకుంటామన్న రేవంత్‌రెడ్డి
- ఈ ఏడాది రుణ పరిమితి 52 వేల కోట్లు
- రుణమాఫీకి కావాల్సింది 40 వేల కోట్లు
- 77% రుణం.. ఒక్క రుణమాఫీకే వాడేస్తే ఇతర పథకాలకు నిధుల సమస్య?
- ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలో రుణమాఫీ అసాధ్యమంటున్న ఆర్థికరంగ నిపుణులు

హైదరాబాద్, మే 17(నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇస్తున్న హామీలు, చెప్తున్న మాటలు ఆచరణ సాధ్యమా? అనే చర్చ జోరుగా నడుస్తున్నది. ముఖ్యంగా ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోనే అప్పు తీసుకొని రుణమాఫీ చేస్తామంటున్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ఆర్థికరంగ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది. సీఎం చెప్పినట్టు సాధ్యమవుతుందా? లేదా? అని లెక్కలు వేస్తున్నారు. రాష్ట్రానికి మొత్తం ఎంత అప్పు తీసుకోవచ్చు? వాటిని ఏయే కార్యక్రమాలకు వినియోగిస్తారు? రుణమాఫీని కూడా ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకొస్తే, ఇక తెచ్చుకునే అప్పులో మిగిలేది ఎంత? ఆ మిగిలిన దాంతో ఇతర పథకాలు నడుస్తాయా? అనే అంశాలపై చర్చ జరుగుతున్నది. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఒకేసారి రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఆశపెట్టారు. కానీ, అది సాధ్యం కాలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేసి తీరుతానని సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టు పెట్టారు. ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేసి రైతుల రుణం మొత్తాన్ని బ్యాంకుల నుంచి కార్పొరేషన్‌కు బదిలీ చేయించుకుంటామని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా ఆగస్టు 15 నాటికి రుణమాఫీ అవుతుందా? లేదా? కార్పొరేషన్ ఏర్పాటుతో ఇది సాధ్యమవుతుందా? లేదా? అనే అంశంపై ప్రధానంగా చర్చ జరుగుతున్నది.

52 వేల కోట్లలో 40 వేల కోట్లు రుణమాఫీకి ఇస్తే...

రాష్ట్ర జీఎస్‌డీపీ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వార్షిక రుణ పరిమితి విధిస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.14 లక్షల కోట్లు. ఈ లెక్కన ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.52 వేల కోట్ల రుణం తీసుకునేందుకు వెసులుబాటు ఉన్నది. ఇందులో ఒక్క రుణమాఫీ కోసమే రూ.40 వేల కోట్లు వినియోగిస్తే.. ఇక మిగిలేది రూ.12 వేల కోట్లు. ఈ నేపథ్యంలో మిగిలిన పథకాల పరిస్థితి ఏమిటనే ప్రశ్న వినిపిస్తున్నది. మరోవైపు, కాంగ్రెస్ ఇచ్చిన భారీ హామీలు రాష్ట్ర ఆర్థికంగానికి పెను సవాల్ అనే అభిప్రాయాలున్నాయి. ప్రస్తుత పరిస్థితిలో రాష్ట్ర రాబడితోపాటు అప్పులు తీసుకుంటే తప్ప ఆయా పథకాలు అమలయ్యే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రుణంలో అధిక మొత్తం రుణమాఫీకే కేటాయిస్తే, మిగిలిన పథకాలకు కోత తప్పదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీతోపాటు రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, వరికి క్వింటాకు రూ.500 బోనస్, ప్రతి మహిళకు నెలకు రూ.2,500, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, చేయూత పింఛన్ రూ.4 వేలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇలా అనేక పథకాలను అమలు చేయాల్సి ఉన్నది. ఇవన్నీ నెరవేర్చాలంటే ఆర్థిక భారం తడిసి మోపెడు అవుతుందని ఆర్థికరంగ నిపుణులు చెప్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రుణపరిమితిలో మెజార్టీ రుణాన్ని రుణమాఫీకి కేటాయిస్తే, మిగిలిన పథకాలను అమలుచేయడం అసాధ్యమనే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు.

రుణమాఫీ సాధ్యమయ్యేనా?

ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న మాటలు సాధ్యమయ్యే పరిస్థితి లేదంటున్నారు ఆర్థిక నిపుణులు. ఇందుకు పలు కారణాలను ఉదహరిస్తున్నారు. ముఖ్యంగా బ్యాంకులు తమ రుణాన్ని కార్పొరేషన్‌కు బదిలీ చేసేందుకు ఒప్పుకుంటాయా? అనే ప్రశ్న లేవనెత్తుతున్నారు. ఒకవేళ అంగీకరిస్తే రూ.40 వేల కోట్ల భారీ రుణాన్ని బ్యాంకులు ఒకేసారి బదిలీ చేసుకునేందుకు వీలుంటుందా? అనేది మరో ప్రశ్న. ఇది అసాధ్యమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఇందుకు కేవలం ఇక్కడి బ్యాంకులు ఒప్పుకొంటే సరిపోదని, ఆర్బీఐ అనుమతి తప్పనిసరిగా అవసరమవుతుందని అంటున్నారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ అనుమతి కూడా అవసరం కావొచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేయనున్న కార్పొరేషన్‌కు ఆదాయాన్ని ఎక్కడి నుంచి చూపిస్తారనేది పెద్ద ప్రశ్న. ఏదో ఒక ఆదాయాన్ని చూపిస్తే.. ఇందుకు బ్యాంకులు సమ్మతిస్తాయా? అనేది మరో ప్రశ్న. ఇన్ని ప్రశ్నల నేపథ్యంలో ఆగస్టు 15లోపు రుణమాఫీ దాదాపు అసాధ్యమేనన్న అభిప్రాయాన్ని ఆర్థికరంగ నిపుణులు వ్యక్తంచేస్తున్నారు.

లోకం పోకడ



ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	41.5°c	21.5°c
నిజామాబాద్	38.8°c	22.9°c
రంగారెడ్డి	38.5°c	21.5°c
నల్లగొండ	36.9°c	26.7°c
మెదక్	36.8°c	21.1°c
మహబూబ్‌నగర్	36.0°c	25.0°c
ఖమ్మం	35.0°c	26.0°c
కరీంనగర్	32.0°c	26.0°c
హైదరాబాద్	31.0°c	27.0°c
వరంగల్	29.0°c	25.0°c

నేడు క్యాబినెట్ భేటీ?

- వ్యవసాయ రంగ అంశాలపై ప్రధాన చర్చ
- విభజన చట్టం పెండింగ్ అంశాలపైనా దృష్టి
- ఆదాయ పెంపుపై చర్చించనున్న మంత్రిమండలి
- ఈసీకి ఎజెండా.. అనుమతిస్తేనే సమావేశం

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనున్నది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున క్యాబినెట్ భేటీ ఎజెండాను ఈసీకి ప్రభుత్వం పంపించింది. ఈసీ నుంచి అనుమతి వస్తే మధ్యాహ్నం మంత్రిమండలి సమావేశం కానున్నది. భేటీలో పలు ప్రధాన అంశాలపై మంత్రిమండలి చర్చించనున్నది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి చెందిన పలు అంశాలపై క్యాబినెట్‌లో చర్చించనున్నారు. రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, వానకాలం పంటల ప్రణాళికపై చర్చ జరుగనున్నది. రాష్ట్ర ఆదాయం పెంపు దిశగా వనరుల సమీకరణ, ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించనున్నారు. మేడిగడ్డ, అన్నారం బరాజ్‌ల మరమ్మతుల కోసం ఎన్‌డీఎస్‌ఏ ఇటీవలే ఇచ్చిన మధ్యంతర నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. పాఠశాలలు, కళాశాలల ప్రారంభానికి ముందే విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ తదితర అంశాలపై విధివిధానాలు నిర్ణయిస్తారు. జూన్ 2తో రాష్ట్ర విభజన జరిగి పదేండ్లు పూర్తవుతున్నది. ఈ నేపథ్యంలో విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై, తెలంగాణ, ఏపీ మధ్య అపరిష్కృత అంశాలపై చర్చించి, వాటిని పరిష్కరించే ప్రణాళికలు రూపొందించనున్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎన్నికకు మరోసారి పేర్లను ప్రతిపాదించే అంశంపైనా మంత్రిమండలి సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నది.

చెప్పలేము.. చెయ్యలేము!

మొదటిపేజీ తరువాయి...



ఉన్నప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, అంచనాలు, సాధ్యాసాధ్యాలు పట్టించుకోకుండా హామీలు ఇవ్వడం పరిపాటి. కానీ, అధికారంలో ఉన్నవారు నిర్ణయాలు ప్రకటించే ముందు.. ఆయా శాఖల అధికారులు, నిపుణులతో సంప్రదించి, ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకొని, సాధ్యాసాధ్యాలను అంచనావేసి స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకున్న తర్వాత ముందుకెళ్లాల్సి ఉంటుంది. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇలాంటి కసరత్తు ఏదీ చేయకుండానే, ఫలానా తేదీలోగా అమలు చేస్తామంటూ ప్రకటనలు ఇస్తున్నారని, డెడ్‌లైన్‌లోగా అమలు చేయాలంటూ తమను ఆదేశిస్తున్నారని చెప్తున్నారు. దీనికి రుణమాఫీని ఒక ఉదాహరణగా చూపిస్తున్నారు. మరికొన్ని విషయాల్లో ముందు వెనుక ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకొని తమను ఇరుకున పెడుతున్నారని, ముందుకు, వెనక్కు వెళ్లలేని పరిస్థితి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ వంటి వ్యవహారాలు ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు. దీంతో ఈ విషయాలన్నీ సీఎంకు ఎలా సర్దిచెప్పాలో తెలియక అధికారులు సతమతం అవుతున్నారట. విపరీతమైన ఒత్తిడి కారణంగా కొందరు అధికారులు అనారోగ్యం పాలవుతుంటే, మరికొందరు సెలవుల్లో వెళ్లిపోవాలని ఆలోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

డబ్బులు ఎక్కడి నుంచి తేవాలి?

సీఎం రేవంత్‌రెడ్డి చేసే ఆర్భాటపు ప్రకటనలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒత్తిడి తమపై పడుతున్నదని ఆర్థికశాఖ వర్గాలు వాపోతున్నాయి. ఉదాహరణకు ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం ఏకంగా ఒట్టు మీద ఒట్టు వేశారని గుర్తుచేస్తున్నారు. రుణమాఫీకి దాదాపు రూ.40 వేల కోట్లు అవసరమని, ఈ నిధులు ఎక్కడి నుంచి తెస్తామో కనీసం సమీక్షించకుండా హామీ ఇచ్చేశారని చెప్పుకుంటున్నారు. ఆలోగా జరిగిపోవాలని తమను ఆదేశిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రుణమాఫీ కోసం కార్పొరేషన్ ఏర్పాటు కూడా సాధ్యం కాదని చెప్తున్నారు. రాష్ట్ర రుణ పరిమితి ఏడాదికి రూ.55 వేల కోట్ల లోపేనని, ఆఫ్ బడ్జెట్ రుణాలను కూడా ఎఫ్‌ఆర్బీఎం రుణం కిందే పరిగణిస్తున్న నేపథ్యంలో అదనంగా రుణం రాదని స్పష్టం చేస్తున్నారు. రుణమాఫీ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసినా రూ.40 వేల కోట్ల రుణం సాధ్యం కాదని తేల్చిచెప్తున్నారు. ఒకవేళ బ్యాంకులు ఇచ్చినా, మిగతా రూ.12 వేల కోట్లతో ప్రభుత్వం నడవడం అసాధ్యమని అంటున్నారు. దీనికి తోడు వానకాలం పంట నుంచి అంటే రానున్న డిసెంబర్ నుంచి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారని, దీనికి మరో రూ.7,500 కోట్ల వరకు అవసరమని వివరిస్తున్నారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గుతున్న సమయంలో.. ఉద్యోగుల జీతభత్యాలు, సంక్షేమ పథకాలకే కనాకష్టంగా ఉన్నదని అంటున్నారు. దీనికి అదనంగా 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్ వంటి పథకాలకు నిధులు సర్దడం తలకు మించిన భారంగా తయారైందని చెప్తున్నారు. ఇలాంటి సమయంలో కొత్త ప్రకటనలు చేసి 'ఎలాగైనా చేయాల్సిందే' అంటూ హుకూం జారీ చేయడంపై ఆర్థిక శాఖ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

రెవెన్యూ శాఖలో గందరగోళం

ఎన్నికలకు ముందు ధరణి పోర్టల్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద బూచిగా చూపిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ధరణి పునర్నిర్మాణం కోసం ప్రత్యేకంగా కమిటీని నియమించింది. 5 నెలలుగా ఆ కమిటీ తేల్చిందేమీ లేదని అధికారులు చర్చించుకుంటున్నారు. కమిటీ వేసినప్పటి నుంచి తమపై ప్రజల నుంచి ఒత్తిడి పెరిగిందని వాపోతున్నారు. ధరణిపై ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందో ఇప్పటివరకు స్పష్టత లేదని చెప్తున్నారు. వాస్తవానికి ధరణిపై ప్రభుత్వం రాజకీయ కోణంలో తప్ప.. ప్రజాకోణంలో పనిచేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎన్నిరకాల భూ సమస్యలున్నాయి? వాటి పరిష్కారానికి తాత్కాలిక, శాశ్వత చర్యలేంటి? అనే కోణంలో కాకుండా.. గత ప్రభుత్వాన్ని ఏ విధంగా తిట్టొచ్చు అనే కోణంలోనే ప్రభుత్వం ఆలోచిస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ధరణి పోర్టల్, దరఖాస్తుదారులు, అధికారులు త్రిశంకుస్వర్గంలో ఉండిపోయారని అంటున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసుతో తలనొప్పులు

రాష్ట్ర ప్రభుత్వం తెరపైకి తెచ్చిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అటు ప్రభుత్వాన్ని, ఇటు అధికారులను ఇరుకున పెడుతున్నదని పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఫోన్ ట్యాపింగ్ అంటూ హడావుడి చేసి పేర్లు బయటపెట్టి, కేసులు నమోదు చేసినా.. ఇప్పు డు ఎలా ముందుకు వెళ్లాలో అధికారులకు అర్థం కా వడం లేదట. వాస్తవానికి ప్రభుత్వాలు ఫోన్ ట్యా పింగ్ చేయడం సర్వ సాధారణమని, ఇది గుట్టుగా సాగే వ్యవహారమని, ఇందులో ఎవరున్నారో కూడా బయటికి తెలియదని అధికారులు మొదటి నుంచీ చెప్తున్నారట. ఈ వివరాలను బయటపెట్టడమంటే దేశ రహస్యాలను బయటపెట్టడమేనని, అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నారట. ప్రభుత్వ పెద్ద మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా రాజకీయ కోణంలో ఫోన్ ట్యాపింగ్‌ను పెద్ద కుంభకోణంగా చిత్రీకరించడంతో ఇప్పుడు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అంటున్నారు. దేశంలో ఇప్పటివరకు ఇలాంటి వ్యవహారాలు బయటికి రాలేదని, ఎలా ముందుకు వెళ్లాలో రెఫరెన్స్ లేదని అధికారులు మథనపడుతున్నారట. సాంకేతికంగా ఎలాంటి ఆధారాలు లేకపోవడం న్యాయపరంగా ఎలాంటి చిక్కులు వస్తాయో, అంతర్గత భద్ర తపరంగా కేంద్రం నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో తెలియక సతమతం అవుతున్నారట. ఇప్పటికే ఈ అంశంపై కేంద్రం నుంచి చీవాట్లు పడ్డట్టు సమాచారం. ప్రభుత్వ పెద్దలు ఈ కేసులో ఒకరిద్దరు అధికారులతోనే మాట్లాడుతూ.. వాళ్లు చెప్పిందే వింటూ ఆదేశాలిస్తున్నారని, కనీసం భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదని వాపోతున్నారు.

రాబడి పెరగాలంటే ఎలా?

మేం పథకాలు ప్రకటించాం కాబట్టి.. దానికి తగ్గట్టుగా రాష్ట్ర ఆదాయం పెంచాలి అని ఆదేశిస్తున్నారే తప్ప స్పష్టమైన రోడ్‌మ్యాప్ వివరించడం లేదని ఆయా శాఖల అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని తాగబోతులమయం చేస్తున్నారని, మద్యం ఆదాయంపైనే ప్రభుత్వం నడుస్తున్నదంటూ విమర్శలు గుప్పించారని, బెల్ట్‌షాపులను తొలిగిస్తామని ఘనంగా చెప్పుకున్నారని గుర్తుచేస్తున్నారు. తీరా ఇప్పుడు ఎక్సైజ్ ఆదాయం ఎందుకు పెరగడం లేదు? అని ప్రశ్నిస్తున్నారని వాపోతున్నారు. టార్గెట్లు పెట్టి, వారానికి, నెలకోసారి సమీక్షించి 'అమ్మకాలు పెంచండి' అని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలోని బెల్ట్‌షాపులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని అంటున్నారు. కొందరికే అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ, ఒత్తిడితెస్తూ.. ఇసుక అమ్మకాలు, మైనింగ్ విభాగం నుంచి సినరేజీ పెరగాలంటే ఎలా? అని చర్చ జరుగుతున్నది. జీఎస్టీ అధికారులపై కేసులు నమోదు చేస్తుండటంతో జీఎస్టీ వసూళ్లపై ప్రభావం పడే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. రాష్ట్ర ఖజానాకు భూముల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం కూడా ఒక ప్రధాన వనరు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. దీంతో భూముల అమ్మకాలు మందగించాయని అధికారులు చెప్తున్నారు. ఇదే సమయంలో తాము చెప్పిన వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించాలని ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిడి వస్తున్నదని, ఇలాంటి పరిస్థితుల్లో భూముల అమ్మకాల ఆదాయం ఎలా పెరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. ఇక కొందరు ప్రభుత్వ పెద్దలు తమ వ్యక్తిగత కక్షతో బడా బిల్డర్లు, రియల్‌ఎస్టేట్ సంస్థలపై దాడులు చేస్తూ, రకరకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారనే చర్చ జరుగుతున్నది. కారణం లేకున్నా భారీగా జరిమానాలు విధిస్తుండటంతో రాబడి తగ్గుతున్నదని అధికారులు వాపోతున్నారు.

ఎలా తప్పించుకుందాం?

ఈ పరిణామాలతో అధికారులు తీవ్ర ఒత్తిడితో నలిగిపోతున్నారని సమాచారం. తట్టుకోలేని కొందరు ఉన్నతాధికారులు ఇప్పటికే అనారోగ్యం పాలై దవాఖానల్లో చేరారని చెప్తున్నారు. దీంతో ఎలా తప్పించుకోవాలని వారు ఆలోచిస్తున్నట్టు సమాచారం. కొందరు శాఖలు మారేందుకు యత్నిస్తున్నారని, మరికొందరు సెలవులు పెట్టి యాత్రలకు వెళ్లాలని ప్లాన్ వేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ముందుగా అధికారులతో సమీక్షించి, చర్చించి, ఆ తర్వాతే నిర్ణయాలు ప్రకటించాలని కోరుతున్నారు.

ఐదు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని పశ్చిమ విదర్భ పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తన ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయని తెలిపింది. శనివారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మ ల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబనగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. మహబూబాబాద్ జిల్లాలో శుక్రవారం అతి భారీ వర్షం కురిసినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కే నాగరత్న తెలిపారు.

రాజకీయ దురుద్దేశంతో ఎమ్మెల్సీ కవితపై కేసు

- బీఆర్‌ఎస్ నేతలు ఆర్‌ఎస్పీ, బాల్క సుమన్

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కేసు పెట్టారని బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీలోని తీహార్ కేంద్ర కారాగారంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం ములాఖత్ అయ్యారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఏ దేశమైనా ఆదాయాన్ని పెంచుకోవడానికి రకరకాల పాలసీలు చేస్తుంటాయని, ఇందులో భాగంగానే ఢిల్లీ ప్రభుత్వం లిక్కర్ పాలసీ తీసుకొచ్చిందని చెప్పారు. నిర్దోషిగా నిందితులే నిరూపించుకోవాలని, అంతవరకు జైల్లో పెట్టవచ్చన్న పీఎంఎల్‌ఏ చట్టంలో సెక్షన్ 50లో ఉన్న నిబంధనను అడ్డంపెట్టుకొని రాజకీయ ప్రత్యర్థుల గొంతు నొక్కే ప్రయత్నం బీజేపీ చేస్తున్నదని విమర్శించారు. తీవ్రవాదులకు ఆర్థిక వనరులు చేరడం, డ్రగ్స్ రవాణాకు నిధుల వినియోగం, దేశ ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలిగించే చర్యలకు పీఎంఎల్‌ఏ చట్టం వర్తిస్తుందని చెప్పారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో డబ్బులే లేనప్పుడు ఈ కేసుకు పీఎంఎల్‌ఏ ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు.

కేసులకు భయపడం: బాల్క సుమన్

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను, పార్టీ నాయకులను కేసులతో బెదిరిస్తారనుకుంటే అది బీజేపీ భ్రమనే అవుతుందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్పష్టంచేశారు. ఎమ్మెల్సీ కవిత ధైర్యంగా ఉన్నారని చెప్పారు.

ఎమ్మెల్సీ దండె విఠల్‌కు ఊరట

హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదని ఈ నెల 3న హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు శుక్రవారం స్టే విధించింది. నిర్మల్ జిల్లా సారంగపూర్ జడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ గతంలో ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నికపై హైకోర్టును ఆశ్రయించాడు. ఈ ఎన్నికల్లో తాను పోటీచేసేందుకు నామినేషన్ వేసినప్పటికీ, తన ప్రమేయం లేకుండానే ఫోర్జరీ సంతకాలతో నామినేషన్ ఉపసంహరించారని, ఎన్నికల అధికారులు సైతం తన నామినేషన్ ఉపసంహరించినట్టు ప్రకటించారని అప్పట్లో పత్తిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఈనెల 3న ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదని తీర్పు వెలువరిస్తూ రూ.50 వేల జరిమానా కూడా విధించింది. తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు నాలుగు వారాల గడువు ఇచ్చింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మెల్సీ దండె విఠల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దండె విఠల్ ఎన్నికల చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధించింది.

రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంఘాల డిమాండ్

హైదరాబాద్, మే17 (నమస్తే తెలంగాణ)/కాచిగూడ: బీసీల రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తర్వాతే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్రంలోని 13 బీసీ సంఘాలు, 30 కుల సంఘాలు డిమాండ్ చేశాయి. రిజర్వేషన్లపై చర్చించడానికి శుక్రవారం ఈ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ జూన్ నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రభుత్వం ప్రకటించడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. కులాలవారీగా జనాభా లెక్కలు తీసి, బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇప్పటికీ కులగణన ప్రక్రియ మొదలుకాలేదని, రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ, కుల సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, లాల్ కృష్ణ, దానకర్ణాచారి, నీల వెంకటేశ్, జనార్దన్, నంద గోపాల్, వేముల రామకృష్ణ, చంద్రశేఖర్, ఉదయ్, రఘుపతి, ప్రణితరాణి, రాజ్‌కుమార్, శివమ్మ, నిఖిల్, నాగరాజు, కోటేశ్వరచారి, వినోద్, వేణుకుమార్, తిలక్‌సింగ్, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ఆర్ కృష్ణయ్య

తెలుగు రాష్ట్రాల్లో డబుల్ ఓట్లను తొలగించాలి

ఈసీకి టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ లేఖ



హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోగా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న డబుల్ ఓట్లను తొలగించాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు లేఖ రాసినట్టు గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాకు తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల కంటే హైదరాబాద్‌లో ప్రస్తుత ఎన్నికల్లో 0.7 శాతం పోలింగ్ తగ్గిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం చాలా తగ్గిందని తెలిపారు. ఆయా కారణాలపై ఎన్నికల కమిషన్ లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉండాలని, హైదరాబాద్ నగరంలో బోగస్ ఓట్లు, డూప్లికేట్ ఓట్లు, చివరకి చనిపోయిన వారికి కూడా ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చాలా మందికి తెలంగాణలో, ఆంధ్రాలో రెండుచోట్ల ఓట్లు ఉన్నాయని ఆరోపించారు.

స్థానికంలో బీసీ కోటా లేనట్టేనా!

మొదటిపేజీ తరువాయి...

పద్ధతిలో, ర్యాండమ్‌గా బీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తుండగా ప్రతిసారీ వాటిపై న్యాయవివాదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓబీసీ రిజర్వేషన్లపై కర్ణాటకకు చెందిన కేఈ కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవాళి కేసులో సుప్రీంకోర్టు ట్రిపుల్ టీ పేరిట పలు మార్గదర్శకాలు జారీ చేసింది. అందులో మొదటిది ప్రతి స్థానిక సంస్థ ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన, డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలి. రెండోది జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లను స్థిరీకరించాలి. మూడోది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. వాటినే ట్రిపుల్ టీ అంటారు. వీటిని పాటించని ఏ రాష్ట్రంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆ నిబంధనలను పాటించని పలు రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసింది. బీసీ కమిషన్ సిఫారసులు లేకుంటే బీసీలకు రిజర్వ్ చేసిన స్థానాలన్నింటినీ జనరల్‌గా మార్చే అవకాశం ఉన్నది. దీనిని బట్టి కమిషన్ల నివేదిక లేకుండా స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లు ఇకపై ఉండబోవనేది స్పష్టంగా తెలుస్తున్నది.

ఇప్పటికీ నివేదిక సమర్పించని కమిషన్

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి తెలంగాణ ప్రభుత్వం గతంలోనే డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలో పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. దీనిపై అధ్యయనం చేపట్టిన కమిషన్.. తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించింది. గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పుల వల్ల ఉత్పన్నమైన అంశాలను పరిశీలించింది. ఆయా రాష్ట్రాల్లో అమలుచేస్తున్న బీసీ రిజర్వేషన్లు, సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు, జనగణనలో ఎదురైన సవాళ్లు, పరిష్కార మార్గాలు తదితర అంశాలపై అక్కడి బీసీ కమిషన్లతో సమాలోచనలు జరిపింది. అనంతరం రాష్ట్ర ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో (స్థానిక సంస్థలలో) బీసీల ప్రాతినిధ్యం, పొందిన అవకాశాలకు సంబంధించి ఆయా శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని, గణాంకాలను అందజేయాలని ఆదేశించింది. ఆ సమాచారం కమిషన్‌కు ఇప్పటికీ చేరలేదని తెలుస్తున్నది. దీంతో నివేదికను సమర్పించడంలో తీవ్ర జాప్యమవుతున్నదని భావిస్తున్నారు.

ఒడిశా బాటలోనే రేవంత్ సర్కారు?

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలు బీసీ కమిషన్లను ఏర్పాటు చేసి వాటి సిఫారసుల మేరకు బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించి ఎన్నికలు నిర్వహించాయి. ఆయా రాష్ట్రాలు ఓటరు జాబితా ఆధారంగా బీసీల రిజర్వేషన్లను స్థిరీకరించాయి. ఓటరు జాబితా ప్రకారం రిజర్వేషన్లను స్థిరీకరించాలనుకుంటే తాజా ఓటరు జాబితా ఆధారంగా చేయాల్సి ఉంటుంది. అప్‌డేటెడ్ ఓటరు జాబితా ఇప్పటికీ కమిషన్‌ను చేరలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటరు జాబితా ప్రకారమైనా బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు మరో రెండు నెలల సమయం పడుతుందనేది అంచనా. ఈ నేపథ్యంలో జూన్ చివరినాటికి ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించడంతో బీసీల రిజర్వేషన్లు ఇక గల్లంతేనని బీసీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అందుకు ఒడిశా అనుభవాన్ని ఉదహరిస్తున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్లను కల్పించి స్థానికసంస్థల ఎన్నికలను నిర్వహించింది. అదే బాటలో రేవంత్ సర్కారు ముందుకు వెళ్తున్నదని భావిస్తున్నారు. అలా అయితేనే కమిషన్ నివేదిక లేకుండానే సీఎం ప్రకటించినట్టు జూన్ నెలాఖరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం సాధ్యమవుతుందని, లేదంటే అది అసాధ్యమని చెప్తున్నారు.

కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ఉత్త ముచ్చటేనా?

రాష్ట్రంలో ఇంటింటి సమగ్ర కులాలగణన (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల వారీగా) నిర్వహిస్తామని, బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని, అదీ బీసీ ఉపకులాల వారీగా అమలు చేస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని చేర్చింది. అయితే ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఈ డిక్లరేషన్‌కు తిలోదకాలిచ్చేలా ఉన్నదని బీసీ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కులగణన నిర్వహించలేదు. కులాల సర్వే కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసింది. సర్వేను ఏ పద్ధతిలో, ఏవిధంగా నిర్వహించాలనే అంశాలపై బీసీ కమిషన్‌కు ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయలేదు. ఇటీవలనే కులాల సర్వేకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూత్రప్రాయంగా బీసీ కమిషన్‌కు సూచించినట్టు తెలుస్తున్నది. కులాల సర్వే ఇప్పట్లో పూర్తికాదని, దాదాపు ఏడాది సమయం పడుతుందని బీసీ నేతలు, అధికారులు అంచనా వేస్తున్నారు. జూన్ నెలాఖరులోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించడంతో బీసీ డిక్లరేషన్ ఉత్తముచ్చటే అని తేలిపోయిందని బీసీ సంఘాలు మండిపడుతున్నాయి. కులాల సర్వే నిర్వహించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి.